# బందీ

అన్నపూర్ణ అమెరికాలో సాన్‌ఫ్రాన్సిస్కో ఎయిర్‌పోర్టులో దిగింది. ఒక్కతె ఇంత దూరం వచ్చి వాలింది. ఆమె వచ్చిన జెట్ ప్లేన్‌లో ఎవరూ భారతీయులు కన్పించలేదు. అందరూ యూరోపియన్లు, అమెరికన్లు! ఆడవాళ్ళు మోకాళ్ళ వరకూ ఇంకా కొందరు చిన్నవాళ్ళయితే మోకాళ్ళ పైకే తొడలు కన్పించేటట్లుగా స్కర్టులు వేసుకున్నారు. పైన రకరకాల డిజైన్లలో బ్లౌజులు కోట్లు వేసుకున్నారు. చకచక నడుస్తున్న ఆ అందమైన ఆడవాళ్ళను చూస్తే మొట్టమొదటిసారిగా అన్నపూర్ణకు తన చీర భారంగా అనిపించింది. ముదరు రంగుతో పెద్ద జరీ బార్డరున్న చీరె ఆమెకు గంగిరెద్దు వేషంలా కనిపించింది. అందరూ ఒక్కలాంటి వేషంలో వుంటె తనొక్కతె ఈ వేషంలో ! -

అందరూ తన వేషంవైపు ఒక్కసారయినా గమనించి చూడకుండా ఉండలేదు. ఒకరిద్దరు మర్యాదగా "బ్యూటిఫుల్ డ్రెస్" అన్నారు. "ఇండియన్?" అని ప్రశ్నార్థకంగా అడిగారు. అన్నపూర్ణకు ఇంగ్లీషు మాట్లాడడం రాకపోయినా వాళ్ళ పదాలు అర్థమయ్యాయి. చిరునవ్వుతో అవునన్నట్లుగా తలూపింది. వెంటనే ఆమెకు తలూపడం అక్కడ మర్యాద కాదని కూతురు చెప్పింది జ్ఞాపకం వచ్చి "ఎస్-ఎస్" అంది. అయ్యో నాబొంద అమెరికన్లు "ఎస్" అనరు గదా! "యా" అంటారు. అని వెంటనే "యా! యా!" అని చిరునవ్వు నవ్వింది.

భారతీయ స్త్రీలు కాస్త ఈడు వచ్చిందగ్గర్నుంచే పాదాల వరకు కప్పేసుకునే లంగానో, చీరనో కట్టుకుంటారు. ఈమధ్య చిన్నవాళ్ళు నడియీడువాళ్ళు పంజాబీ డ్రెస్సులు వేసుకుంటున్నారు. ఆ డ్రెస్సు మరీ కింది నుంచి మీది దాకా ఒంటిని కప్పేస్తుంది. చీరలో అయితే నడుము దగ్గర ఖాళీగా ఉండడం వల్ల నడుము అందమైనా కన్పిస్తుంది. పంజాబీ డ్రెస్సు కింది నుంచి మీది దాకా దిగేసుకున్నట్లు లావు సన్నం భేదం లేకుండా అందరూ ఒకేలాగ

కన్పిస్తారు. శరీర సౌష్టవం కన్పించే ప్రశ్నేలేదు దానిలో! అయినా ఎందుకు భారతీయ స్త్రీలు ఈ వేషాలకే పరిమితమయ్యారు. మనమూ ఎప్పుడైనా పాశ్చాత్యుల పొట్టి స్కర్టులు వేసుకుంటే ఏమౌతుంది! అప్పుడు అందరూ మనల్ని ఇట్లా విదేశాల్లో వింతగా చూసే అవకాశం వుండదు అనుకుంది అన్నపూర్ణ.

"అమ్మో! ఈ పొట్టి డ్రెస్సులు వేసుకుంటే మా అత్త, భర్త, ఇంకా అందరు చుట్టపక్కాలు ఏమనుకుంటారు?" వెంటనే భయపడిపోయింది అన్నపూర్ణ. ఆ డ్రెస్సులో తననూహించుకొని నవ్వుకుంది.

"అందరికీ ఎందుకు భయపడాలి! వాళ్ళు మనదేశానికి వస్తే మన చీరలు డ్రెస్సులు వేసుకుంటే మనం సంబరపడిపోవడం లేదు! అసలు సంబరమెందుకో నాకర్థం కాదు! మనమూ చక్కగా వాళ్ళ డ్రెస్సులు వేసుకొని వాళ్ళలా వుంటే మనల్ని వింత పశువుగా చూసే అవసరం వాళ్ళకుండదు పాపం! వాళ్ళ డ్రెస్సులు వేసుకోవాలంటే మనం ఫిగర్ బాగా మెయింటెన్ చేయలేము. మన డ్రెస్సులయితే మన అందంలో లోపాల్ని ఎన్నిటినో దాచేస్తున్నాయి మరి!" అనుకుని నవ్వుకుంది అన్నపూర్ణ.

"భారతీయ సంస్కృతి నాగరికత అంతా ఈ చీరతోనే సంరక్షింపబడ్తున్నట్లు మనమెందు కనుకుంటున్నాం! వేల సంవత్సరాల కిందటి చిత్రాలు, శిల్పాలు చూస్తే - అంగదట్టం అనేమో పేరు - మొత్తంమీద పొట్టివి ఈ స్కర్టుల్లాంటి డ్రెస్సులు కొంగుల్లేని డ్రెస్సులే వేసుకున్నారు. మరి! ఈ ఆరుగజాల చీర! ఒంటినంతా ఏం కన్పడకుండా కప్పేసే చీర ఎప్పట్నుంచి వచ్చిందో!- వచ్చి భారతీయ స్త్రీల పవిత్రత గౌరవాలను ఈ చీరే కాపాడుతుందన్న భావం స్థిరపడింది. ఆరు గజాల చీర భారతీయ స్త్రీకి సంకెళ్ళుగా మారిందేమో! చీర తప్ప వేరే స్కర్టు ప్యాంటు వేసు కోవడం- అంత పెద్ద విప్లవాత్మకమైన మార్పు ఎప్పుడైనా వస్తుందా? - చీరలోనే అందం చందం చీరతోనే గౌరవం పెరుగుతుందని మనవాళ్ళు అనుకున్నదాకా ఈ మార్పు రాదేమో! అయినా ఏమిటీ పిచ్చి ఆలోచనలు నాకు! నా ఆలోచనలు ఎవరికైనా చెప్తే ఈ వయస్సులో నీకివేం పాడు బుద్ధులే! అని అంటారు కూడా" తనలో తానే నవ్వుకుంది అన్నపూర్ణ.

విమానం కిందికి దిగుతుండగానే చూసింది అన్నపూర్ణ. పెద్ద పెద్ద ఆకాశాన్నంటే మేడలు! "వీళ్ళకు నీళ్ళ కరువు కరెంటు కరువు లేదా? మనకులాగ!" ఆశ్చర్యపోయింది అన్నపూర్ణ.

విమానంలో నుంచి దిగి అన్నపూర్ణ అందరితో పాటు గబగబ నడుస్తూ ఎయిర్‌పోర్టు లాంజ్‌లోకి వచ్చి నిలబడింది. అటు యిటు చూసింది. అల్లుడు ఆనంద్ రిసీవ్ చేసుకోడానికి వస్తానన్నాడు. "మీరు ఒంటరిగా ఎట్లా రావాలని భయపడకండి అత్తగారూ! మీరు విమానంలో నుంచి దిగగానే నేను మిమ్మల్ని రిసీవ్ చేసుకోవడానికి మీ ముందు నిలబడ్తాను. కంగారు

పడవలసిన అవసరమే లేదు!" అని ఇండియానుంచి బయల్దేరే ముందురోజు ఫోనులో చెప్పాడు.

ఆనంద్ కన్పిస్తాడేమోనని జాగ్రత్తగా అన్నపూర్ణ అటుయిటు చూసింది. ఎక్కడా కన్పడలేదు. కిందకు వాటికవే జారుతున్న మెట్లు కన్పించాయి. వాటిని "ఎస్కలేటర్లు" అని అంటారని అమ్మాయి చెప్పింది. "దాని మెట్టు మీద నిలబడితే అదే నిన్ను కష్టం లేకుండా కిందకు చేరుస్తుంది. కాని చీర జాగ్రత్త ! చీర అంచులు ఎస్కలేటర్లో ఇరుక్కుంటాయి భద్రంగా నిలబడు!" అని కూడా చెప్పింది.

అన్నపూర్ణ జాగ్రత్తగా చీరను పైకి లేపిపట్టుకొని ఎస్కలేటరు మెట్టు మీద నిలబడింది. దిగే కష్టం కాళ్ళ నొప్పుల్లేకుండా కిందికి వచ్చేసింది. చాలాచోట్ల ఈ జారే మెట్లు వున్నాయి. కాబట్టి ఓ చేతిలో పాస్‌పోర్టు మొదలైన కాగితాలు డబ్బువున్న హ్యాండ్‌బ్యాగును పట్టుకుంది. మరో భుజానికి షోల్డరు బ్యాగు వేలాడేసుకుంది. ఆ బ్యాగులోనే ఆవకాయ గోంగూర పచ్చళ్ళ సీసాలు - అవేగాక తను జాగ్రత్తగా పెట్టిన చేపల మాంసం పచ్చళ్ళ సీసాలు సీలు చేసినవి వున్నాయి. ఆ సీసాలతో బ్యాగు బరువుగా వుంది. ఆ బ్యాగును మోసి మోసి అన్నపూర్ణ భుజం నడుం నొప్పితో పీకుతున్నాయి.

"అమెరికాలో దొరకని వస్తువే లేదు. అన్నిరకాల పచ్చళ్ళు అక్కడ దొరుకుతున్నాయని మన సుందరి వదిన చెప్పిందే! నేనొక్కదాన్నే వస్తున్నాను. ఏం గల్లంతవుతుందో యేమో ఏ పచ్చళ్ళు తేను!" అంది అన్నపూర్ణ కూతురుతో.

"నిజమేనమ్మా! అన్నీ దొరుకుతాయి గాని - ఇక్కడివేం బాగుండవు! బేడెకర్ మాడెకర్ అని పచ్చళ్ళు అమ్ముతారు కాని మన పచ్చళ్ళ రుచి - అందులో - నువ్వు పెట్టే పచ్చళ్ళ రుచి వాటిల్లో వుండదు. అట్లాగే మాంసం చేపల పచ్చళ్ళు తీసుకురా అమ్మా!" అని ప్రత్యేకంగా కోరి అడిగింది కళ్యాణి. అందులో నీళ్ళు పోసుకున్న పిల్ల కోరేసరికి కాదనలేకపోయింది అన్నపూర్ణ. కూతురు నీళ్ళాడుతుందని ఆసరాగా వుండాలనే ఆమె అమెరికా వచ్చింది. "అమెరికన్ కన్‌సులేటు వాళ్ళకేం వచ్చిందో కూతురు నీళ్ళాట అంటే నాకేమో వీసా ఇచ్చారు. ఆయనకేమో వీసా ఇయ్యలేదు! అందుకే గద! ఒక్కదాన్నే బయలుదేరవలసి వచ్చింది!" అనుకుంది అన్నపూర్ణ. అక్కడికి అన్నపూర్ణ అక్క అంటూనే వుంది.

"అన్నపూర్ణ ఒక్కదానివే వెళ్తే అక్కడ నీకేం తోచదే! మేమిద్దరం వెళ్ళాం హాయిగా తిరిగి వచ్చాం" అంది. "కాని ఆయనకు వీసా ఇయ్యకపోతే తను ప్రయాణం మానుకునే స్థితి లేదాయె! కూతురు నీళ్ళాట! మొదటి కాన్పు. ఆ సమయంలో తల్లి కూతురుకు దగ్గరగా సహాయంగా వుండాలంటారు మరి!" అని అన్నపూర్ణ ఒక్కతె అమెరికా వచ్చింది.

కూతురు నీళ్ళాడిన తర్వాత బలానికి పెట్టె ఎల్లిపాయ కారప్పొడి కరివేపాకు పొడి

ఇంకా ఏవో ఆయుర్వేదం మందులు పొడులు అన్నీ తయారుచేసింది అన్నపూర్ణ. అవన్నీ షోల్డరు బ్యాగులోనే వున్నాయి.

"ఎయిర్‌పోర్టు దగ్గర నీ బ్యాగు ఒకవేళ తీసి ఇవన్నీ ఏమిటని అడిగితే "పర్సనల్ యూజ్ - మెడిసిన్స్!" అని చెప్పమ్మా! లేకపోతే అవన్నీ చెత్తకుండీలో పారేస్తారు వాళ్ళు. పైగా పారేసేందుకు కావల్సిన ఖర్చులకు నీ దగ్గర డాలర్లు కూడా వసూలు చేస్తారు. అందుకనీ జాగ్రత్త! పర్సనల్ యూజ్ - మెడిసన్స్! అని చెప్పు అర్థమయిందా?" అని కూతురు ఫోనులో చెప్పింది. "పర్సనల్ యూజ్ - మెడిసిన్స్" అని నోట్లో అనుకొని ప్రాక్టీసు చేసుకుంది మరోసారి అన్నపూర్ణ.

అన్నపూర్ణ ఎస్కలేటరు దిగి పెద్ద హాల్లోకి వచ్చింది. అక్కడ మీద కన్నా ఎక్కువమంది హడావిడిగా తిరుగుతున్నారు. అంతమందిలో ఆనంద్ ఎక్కడున్నాడా?- అని అన్నపూర్ణ పరీక్షగా చూసింది.

"అత్తయ్యా! ప్రయాణం బాగా జరిగిందా?" దగ్గరగా వెనుక నుంచి చెవి దగ్గర తెలుగులో అన్నారెవరో! వెనుకకు గబుక్కున తిరిగి చూస్తే ఆనంద్.

"నువ్వా! ఆనంద్!" ఆనందంగా అంది అన్నపూర్ణ.

"మీకు ప్రయాణంలో ఏం ఇబ్బంది కాలేదు కద!' అడిగాడు ఆనంద్.

"ప్రయాణంలో ఏ ఇబ్బందీ కాలేదు బాబూ ఆనంద్!" అంది అన్నపూర్ణ.

"అత్తయ్యా రండి! - మీ పెట్టె కలెక్ట్ చేసుకుందాం-" అని ఆనంద్ గబగబ ముందుకు నడిచాడు. ఆనంద్ వెంట అన్నపూర్ణ బరువైన షోల్డరు బ్యాగుతో గబగబ అడుగులు వేసింది. షోల్డరు బ్యాగు వేలాడుతున్న ఎడమచేయి లాగుతున్నది. గుండెలో నొప్పి వేసింది.

"అమ్మో! గుండె నొప్పి కాదుగదా! - హెల్త్ ఇన్సూరెన్సు తీసుకున్నాను!- అయినా ఈ దేశంకాని దేశంలో జబ్బుపడితే పిల్లలకు కష్టం. అందులో కూతురు నీళ్ళోసుకుంది! హెల్త్ ఇన్సూరెన్సు తీసుకునేటప్పుడు ఆయన అన్నాడు. చింతగింజలా వున్నావు ఏ రోగం నొప్పి లేకుండ ఇన్సూరెన్సు డబ్బెందుకు దండుగ!" అని. కాని తనకే భయం వేసింది. అమెరికాలో జబ్బుపడితే మామూలుగా డాక్టరు దగ్గరకు వెళ్తే బోలెడు ఖర్చు అవుతుందని చెప్పగా వింది. అందుకే డబ్బు పిల్లల్తో ఏం పెట్టించాలని హెల్త్ ఇన్సూరెన్సు తీసుకున్నాను"

"అత్తయ్యా!" - అని పిలిచాడు ఆనంద్.

అన్నపూర్ణ తన ఆలోచనల్లోంచి బయటికి వచ్చి ఆనంద్‌కు దగ్గరగా వెళ్ళి నిలబడింది. విమానంలోని పెట్టెలన్నీ జారుతూ వచ్చి చక్రంలాగ వున్న ట్రాక్ మీద తిరుగుతున్నాయి.

"మీ పెట్టె ఏది? అత్తయ్యా గుర్తుపట్టి చెప్పండి!" అన్నాడు ఆనంద్.

అన్ని పెట్టెల మధ్యలో వెంటనే తన పెట్టెను అన్నపూర్ణ గుర్తు పట్టలేకపోయింది.

"మొద్దుమొఖం! పెట్టెను పెట్టె రంగును బాగా గుర్తు పెట్టుకో అని కూడ ఆయన చెప్పాడు. వెర్రి మాలోకం ఎట్ల చేరుతవో" అన్నాడు. నేనేం వెర్రి మాలోకాన్ని కాదులెండి" అని తను గట్టిగానే అంది. - ఇంతలో ఆమె పెట్టె ఆమెకు దగ్గరగా వచ్చింది. వెంటనే అన్నపూర్ణ తన ఊదారంగు పెట్టెను గుర్తుపట్టి ఆనంద్‌కు చూపించింది. ఆనంద్ పెట్టెను చేతిలోకి తీసుకొని అక్కడే వున్న తోపుడు బండిలో పెట్టి వేగంగా ముందుకు సాగాడు.

"రండి ! నా వెంటనే నడవండి లేకపోతే కాట గలుస్తారు!" అని ఆనంద్ గబగబ నడిచాడు. షోల్డరు బ్యాగు బరువూ అందులో అంత గబగబ నడిచే అలవాటు లేదు. అన్నపూర్ణ దబదబ అడుగులు వేస్తూ నడిచింది. కాని కాళ్ళు తడబడుతున్నాయి. లాగుతున్నాయి.

"ఆయన ఉద్యోగంలోనే వున్నాడు. ఇంకా రిటైర్ కాలేదు. అయినా ఆయనకు వీసా ఇయ్యలేదు. నాకేమో ఇచ్చారు! అదేమి చోద్యమో మరి! పాపం! ఆయన వంట చేసుకోలేక ఎంత బాధపడ్తున్నారో! ఆఫీసు నుంచి రాగానే కాఫీ పెట్టుకోవాలి. రాత్రి వంట - పొద్దున్న వంటలతో పాపం! ఆయన ఎన్ని కష్టాలనుభవిస్తున్నాడో! ఆడవాళ్ళు ఎన్ని కష్టాలు పడ్డా ఎవరూ అడుగరు. అదే మగాళ్ళు కాస్త ఇబ్బంది పడేవరకు అందరూ జాలి చూపుతారు మరి! అయినా వచ్చేటప్పుడు నేను గట్టిగానే చెప్పాను. వంటెందుకు చేసుకుంటారు. చేతులేం కాల్చుకుంటారు, హోటల్లో తినండి లేకపోతే ఆయన చెల్లెలు ఇందిర దగ్గరయినా తినండని చెప్పాను. ఏం చేస్తారో పాపం!" అని భర్త జ్ఞాపకం వచ్చాడు అన్నపూర్ణకు.

ఆనంద్ వెంట అన్నపూర్ణ ఎయిర్‌పోర్టు బయటికి వచ్చింది. ఓ పెద్ద స్తంభం దగ్గర తోపుడు బండి ఆపి "ఆ షోల్డరు బ్యాగు ఆ బండిలో పెట్టండి! బరువుగా వుందా? అప్పుడే ఈ బండిలో పెడ్తే బాగుండేది నేను వెళ్ళి కారు తెస్తాను. కాస్త టైమ్ పడ్తుంది. మీరు మాత్రం కదలకుండా ఇక్కడే వుండండి" అని ఆనంద్ గబగబ వెళ్ళిపోయాడు.

అన్నపూర్ణ అటు యిటు చూసింది. అందరూ పరుగుపరుగునే నడుస్తున్నారు. "దేని కంత తొందర ! నెమ్మదిగా నడువొచ్చు గద మరి!" అనుకుంది అన్నపూర్ణ.

"పాపం వీసా దొరికితే ఆయనా ఇదంతా చూసేవాడు! వీసా దొరకకపోయేసరికి చాలా చిర్రుబుర్రుగానే వున్నారాయన! నీ కూతురు నువ్వెళ్ళు! నేనెందుకు మధ్య" అని చిరాకుపడ్డాడు చిందులు తొక్కాడు కూడా.

"కాని ఆయన రావాలని తనకూ వుంది. కాని వాళ్ళు వీసా ఇయ్యకపోతే తనేం చేస్తుంది మధ్య" అనుకుంది అన్నపూర్ణ.

ఏదో తప్పిపోతున్నట్లుగా పరిగెత్తుతున్నారందరూ అటుఇటు చూడకుండా - చూసే టైమ్ లేనట్లుగా - అందరూ గమ్యం వైపు తొందర తొందరగా వెళ్ళిపోతున్నారు. అబ్బ! ఎంతమంది! ఎవరూ అటుయిటు పక్కవాళ్ళను చూడకుండా పట్టించుకోకుండా పరిగెత్తినట్లుగా

నడుస్తున్నారు. అంత తొందర పనులేమిటో! ఎవరూ అనారోగ్యంగా గాని బక్కచిక్కిగాని లేరు. అందరూ పుష్టిగా ఆరోగ్యంగా నిగనిగలాడుతున్నారు. ఎయిర్‌పోర్టులో నిలబడి అటుయిటు పరికిస్తున్నది. అన్నపూర్ణకు సమయమే తెలియలేదు.

"అత్తయ్యా రండి కారెక్కండి!" అన్నాడు ఆనంద్ ముందరే కారు నిలిపి.

ఆనంద్ కార్లోంచి వచ్చి పెట్టె, బ్యాగు డిక్కిలో పెట్టాడు. అత్తగార్ని ముందు సీట్లో డ్రైవరు సీటు పక్కన కూర్చోబెట్టి ఆయన కారు చుట్టూ తిరిగి వచ్చి డ్రైవరు సీట్లో కూర్చున్నాడు. కారు యమస్పీడుతో కదిలింది. కాస్సేపు అన్నపూర్ణకు ఆ వేగానికి కళ్ళు తిరిగినట్లయి భయమేసింది. తర్వాత వెంటనే తేరుకుంది. కారులో సర్దుకొని కూర్చున్నాక అన్నపూర్ణకు గుండెనొప్పి మాయమైనట్లని పించింది. "అమ్మయ్య! అది గుండెనొప్పి కాదన్నమాట మరి! బ్యాగు బరువు వల్లనే నొప్పి వచ్చింది!' అనుకుంది అన్నపూర్ణ.

"అత్తయ్యా! మామయ్య బాగున్నారా?" అడిగాడు ఆనంద్.

"ఆఁ బాగానే వున్నారు బాబూ!"

"మొదట మీకో విషయం చెప్పాలి అత్తయ్యా!" అన్నాడు ఆనంద్ చిరునవ్వుతో.

"ఏమిటా విషయం?" సందేహంగా నోరు తెరిచింది అన్నపూర్ణ. ఏం విషయమా? - అని ఆమె గుండె దడదడలాడింది.

"ఏం లేదు! మీకు మనమరాలు పుట్టింది !" అన్నాడు ఆనంద్.

"అంటే కళ్యాణి అప్పుడే నీళ్ళాడిందా?" ఆశ్చర్యపోతూ అడిగింది అన్నపూర్ణ.

"అవును ఇంటిక్కూడా వచ్చేసింది"

"అయ్యో! పది రోజులు నేను ముందే రావల్సింది! కళ్యాణియేమో నీళ్ళాట ఇంకా పది పదిహేను రోజులున్నాయి. నువ్వు నెమ్మదిగా రా! అంటే ఇప్పుడు బయలుదేరాను మరి! కళ్యాణి బాగుందా? తల్లీ బిడ్డ కులాసానే గదా! ఏం కష్టం కాలేదు కదా!" ఆదుర్దాగా అడిగింది అన్నపూర్ణ. తన తప్పేదో జరిగినట్లు ఫీలయింది అన్నపూర్ణ.

"మీరన్నట్లుగానే కళ్యాణి డెలివరి ఇంకా పదిరోజులకే కావల్సింది. కాని సడెన్‌గా నొప్పులొచ్చేసాయి. హాస్పిటల్‌కు తీసికెళ్తే ఈజీ నేచురల్ నార్మల్ డెలివరి అయింది. నేను దానిపక్కనే వున్నాను గదా దానికేం కష్టం కాలేదు. బిడ్డ కూడా ఆరోగ్యంగా వుంది!" అన్నాడు ఆనంద్.

"నువ్వు పక్క నుండడమేమిటి బాబు ! ఆడవాళ్ళు నీళ్ళాడేటప్పుడు మగాళ్ళను రానియ్యరు గదా" నోరు తెరిచింది అన్నపూర్ణ.

"అవన్నీ పాతకాలం ముచ్చట్లు అత్తయ్యా! ఇక్కడ ఇప్పుడు భర్తే భార్యకు డెలివరీ చేస్తాడు!"

"అయ్యో! అదెక్కడి చోద్యం! నేనెక్కడా విన్లేదు మరి!" అంది అన్నపూర్ణ దవడ చుట్టూ చూపుడు వేలు బొటనవేలు చుట్టేసి.

"దాన్నే నేచురల్ - సహజమైన డెలివరీ అంటారిక్కడ! అంటే ఏ ఆపరేషన్ ఏదీ అవసరం లేకుండా పుట్టడమన్నమాట!"

"నాకూ పిల్లలు పుట్టినప్పుడు ఎప్పుడూ ఆపరేషన్ అవసరం కాలేదు మరి! కళ్యాణి కాన్పు అప్పుడు నేను కత్తిపీట ముందు కూర్చొని కూరలు తరుగుతున్నాను. అంతే నొప్పు లొచ్చేసాయి. హాస్పిటల్‌కు తొందరగానే తీసికెళ్ళారు వెంటనే కాన్పయింది! అసలు ఇంట్లో అయిపొయ్యేదే! అంటు ముట్టు అని మా అత్తగారి గొడవ అనీ! ఇంట్లో ఇంకా మా అత్తగారి అత్తగారు కూడా వుండేది మరి! వాళ్ళ అంటుముట్టులకు భయపడి హాస్పిటల్‌కు వెళ్ళాను! అప్పటికీ హాస్పిటల్ నుంచి వచ్చాక కూడా కొన్ని రోజులు దూరంగానే నన్ను నా బిడ్డ నుంచారు!" చెప్పింది అన్నపూర్ణ.

"అత్తయ్యా! ఆ ప్రాబ్లెమ్స్ ఏమీ లేవు ఇప్పుడిక్కడ! నాకు డెలివరీ ఎలా చేయాలో నేర్పారు. మేమిద్దరం ఓ డెలివరీ అవుతుంటే కూడా చూసాం! ఏం ప్రాబ్లమ్ కాలేదు అత్తయ్యా! ఒక విధంగా మీ అమ్మాయి డెలివరీ నేనే చేసాను అనుకోండి!" నవ్వాడు ఆనంద్.

"అత్తయ్య ! ఇల్లు వచ్చేసింది!" కారును ఓ పెద్ద ఇంటి ముందు ఆపాడు.

"కళ్యాణి ఇల్లు కొన్నామని ఫోన్లో చెప్పింది కాని ఇంత పెద్ద ఇల్లనుకోలేదు మరి! నేను!" ఇంటి ముందు విశాలమైన పచ్చని గడ్డి మొలిచి వుంది. రంగురంగుల గులాబీలు, ఆస్టర్లు ఇంకా ఏవేవో పూలు అందంగా వున్నాయి. ప్లాస్టిక్ పూలేమో! అని ఆశ్చర్యపోయింది అన్నపూర్ణ. అంతగా రంగులతో ఆరోగ్యంగా మెరుస్తూ పూలు కన్పించాయి. తోటంతా శుభ్రంగా వుంది.

"ఇదంతా కళ్యాణే చూసుకుంటుందా! పాపం! దానికి చాలా పని మరి!" మనసులోనే అనుకుంది అన్నపూర్ణ.

అన్నపూర్ణ ఇంటివైపు నడిచింది. ఇంటి ముందు తలుపులు మూసి వున్నాయి.

"అదేమిటి! తలుపులు వేసి వున్నాయి! ఎంత అశుభం! ఇంటిముందు తలుపులు మూసెయ్యడం! మా తాతగారయితే రాత్రిపూట కూడా ఇంటి ముందు తలుపు వేయడం అశుభం అనేవాడు! అటువంటిది?-"

ఇంతలో ఆనంద్ కారు గ్యారేజ్‌లో ఆపి గబగబ పెట్టోతో బ్యాగుతో వచ్చాడు. తలుపుల ముందు నిలబడి బెల్లు నొక్కుతాడేమో అనుకుంటే జేబులో నుంచి తాళం చెవి తీసి తలుపులు తెరిచాడు.

"ఏమిటి! కళ్యాణి ఇంటికి రాలేదా? హాస్పిటల్లో వుందా?" అడిగింది అన్నపూర్ణ.

"కళ్యాణీ బిడ్డ ఇంట్లోనే వున్నారు!"

"ఏమైన భయమా వాళ్ళనింట్లో పెట్టి తాళం వేసుకొని వచ్చావు మరి!" అంది అన్నపూర్ణ.

"ఎవరి తాళంచెవి వాళ్ళ దగ్గరే వుంటుంది అత్తయ్య! వాళ్ళనింట్లో పెట్టి తాళం వేసే కిరాతకుడ్ని కాను అత్తయ్యా!" నవ్వాడు ఆనంద్.

"ఇక్కడెవరూ తలుపులు తీసి వుంచరు. తలుపులు వేయగానే తాళం పడిపోతుంది. అందు కని తాళం ఎవరిది వాళ్ళకుండవలసిందే! గెస్టుల్లాగా మాటిమాటికి బెల్లు కొట్టడం వుండదు" మళ్ళీ చెప్పుకొచ్చాడు ఆనంద్.

"ఏమో మన ఆచారాలు వేరు వీళ్ళ ఆచారాలు వేరు మరి! ఏం చేస్తాం!" మనస్సులోనే అనుకుంది అన్నపూర్ణ.

ఇంట్లోకి వెళ్ళగానే కళ్యాణి "అమ్మా!" అంటు ఎదురుగా వచ్చింది.

"పచ్చి బాలెంతరాలు! ఇంకా స్నానమయిందో లేదో! తాకాల్నా వద్దా!" అని విచికిత్సలో పడ్డ తల్లిని చూసింది కళ్యాణి.

"అమ్మా! ఇక్కడ నీ అంట్లు ముట్లు అన్నీ మరచిపోవాలి !" అని కళ్యాణి దగ్గరగా వచ్చి తల్లిని చుట్టేసింది.

అనుకోకుండా అన్నపూర్ణ చేతులూ కళ్యాణి చుట్టూ చుట్టేసాయి.

"బాగున్నావా తల్లీ! నేను రాకముందే పాప వచ్చేసిందట గదా!" అడిగింది అన్నపూర్ణ ఆప్యాయంగా.

"అమ్మ! ముందు నీ రూం చూపిస్తాను రా! స్నానం అదీ చేసింతర్వాత పాపను చూద్దువు గాని" అని కళ్యాణి ఒక గదివైపు లాక్కెళ్ళింది.

"ఇది గెస్టురూమ్ మా ఇంట్లో !" అంది కళ్యాణి.

"ఇల్లు చాలా బాగుందే కళ్యాణీ! అంత పెద్ద తోట! వెనుక పెరట్లో పళ్ళ చెట్లు కూర గాయల మొక్కలు కూడా వున్నట్లున్నాయి! ఈ తోటంతా చూసుకోడానికి తోట మాలులు న్నారా?" అడిగింది కళ్యాణి ఉత్కంఠతో.

"అయ్యో అమ్మ! ఇక్కడ సర్వెంట్సు - తోటమాలులు కాదు ఒక్కతోటమాలి కూడా దొరకరు. దొరికినా బోలెడు డబ్బు. అన్ని పనులు అంట్లు తోముకోవడం ఊడ్చుకోవడం తుడ్చుకోవడం వగైరా వగైరా పనులన్నీ మనమే చేసుకోవాలి! తోటదేం కష్టం లేదమ్మా! మొక్కల కన్నిటికి చిన్నచిన్న పైపులు భూమిలో వుంటాయి. అవి పంపుకు కనెక్షన్ చేసి వుంటాయి. కంప్యూటరుంది. టైమ్ సెట్ చేసి పెడ్తాం. టైమ్ కాగానే మోటర్ స్టార్టవుతుంది. పాదుల్లో నీళ్ళు నిండడం అయ్యాక మనం సెట్ చేసి పెట్టిన టైమ్‌కు మోటరు ఆగిపోతుంది. ఇంక ఎప్పుడైనా నేను మొక్కల్ని కత్తిరించడంలాంటి పనులు చూసుకుంటాను సరదాగా. ఆనంద్

కూడా చూసుకుంటాడు. మాలి అవసరమే లేదిక్కడ!" అని వివరించింది కళ్యాణి. "సరే! అమ్మ! తొందరగా స్నానం చేసిరా! ఆకలిగా వుండొచ్చు! ప్లేన్‌లో అనాచారమంటు ఏమైన తిన్నావో లేదో! తొందరగా రా ! అదిగో అది బాత్‌రూమ్!" అని కళ్యాణి గది తలుపులేసుకుంటు వెళ్ళిపోయింది.

ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. ఒంటరిగా గదిలో భయమేసింది అన్నపూర్ణకు.

"సరే! తొందరగా స్నానం చేసి వెళ్ళి పాపను చూసి భోంచేస్తాను" అని అనుకొని బట్టలు తీసుకుందామని చేతి బ్యాగులో నుంచి తాళం చెవి తీసి పెట్టెను తెరవబోయింది. తాళం చెవి అయితే తిరుగుతున్నది కాని పెట్టె తెరుచుకోవడం లేదు! అటు యిటు తిప్పింది, లాగింది అన్నపూర్ణ. చివరికి కొంతసేపటికి అకస్మాత్తుగా టక్‌మని పెట్టె తెరుచుకుంది. "అమ్మయ్య!" అనుకొని కావల్సిన బట్టలు తీసుకొని అన్నపూర్ణ పెట్టెను గట్టిగా మూయకుండానే బట్టలతో బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది.

బాత్‌రూమ్‌లో అంతా అయోమయంగా వుంది. వెళ్ళగానే ఎదురుగా పెద్ద నిలువు టద్దం. ఓ పక్క బేసిన్. ఓ పక్క కమ్మోడు. మరోపక్క పెద్దది తెల్లగా మెరుస్తున్న బాత్‌టబ్. నీళ్ళుగాని చెంబులు గాని ప్లాస్టిక్ మగ్గులు గాని బక్కెట్టులుగానీ ఏవీ లేవక్కడ. ఉతికిన శుభ్రమైన టవల్ స్టాండు రాడ్‌కు వేలాడుతున్నది. ఎక్కడా నీళ్ళు తడి అన్నది లేదు. అంత శుభ్రంగా వున్న బాత్‌రూమ్‌లో అన్నపూర్ణకు తన కాళ్ళు మట్టికొట్టుకపోయినట్లుగా అనిపించాయి.

అన్నపూర్ణ బేసిన్‌లో టబ్‌లో వున్న ట్యాపులు తిప్పి చూసింది. నీళ్ళు వేగంగా వస్తున్నాయి. అన్నీ వేడినీళ్ళే! బాత్‌టబ్‌లోకి దిగి అన్నపూర్ణ స్నానం ఎలాగో కానిచ్చింది. బట్టలు వేసుకొని బయటికి వచ్చేసరికి ఆమెకు నీరసం వచ్చేసింది.

"ఈ నీరసమేమిటి బాబు! ఇల్లెడు పనిచేసుకున్నా నాకు అలసట లేదు!" అనుకుంది అన్నపూర్ణ.

బయటికి వస్తే ఎవరూ లేరు. ఒకవైపు మెట్లు కన్పించాయి. అవి ఎక్కి వెళ్తే అన్ని తలుపులు మూసి వున్నాయి. ఏది కూతురు గది! ఇంతలో ఒక గదిలో నుంచి కళ్యాణి మాటలు వినిపించాయి. ఆ గదీ మూసి వుంది. దీనికీ తాళం చెవి కావాలా ఏమిటి? అనుకొని నిలబడిపోయింది అన్నపూర్ణ. ఇంతలో తలుపులు తెరచుకొని ఆనంద్ బయటికి వచ్చాడు.

"రండి అత్తయ్యా! పాపను చూద్దురుగాని!" అని లోపలికి తీసికెళ్ళాడు ఆనంద్.

అన్నపూర్ణ మనుమరాలి దగ్గరగా వెళ్ళి ఎత్తుకోబోయింది. పక్కనే వున్న కళ్యాణి "అమ్మా! అట్లా కాదు. ఇదిగో ఈ బట్టలతో పాటు ఎత్తుకో!" అంది.

కళ్యాణి చెప్పినట్లుగానే పాప నెత్తుకుంది అన్నపూర్ణ. ఆర్గుర్ని కన్న తనకు కళ్యాణి పాపనెట్లా ఎత్తుకోవాలో చెప్పడమేమిటి! ఏమిటో మరి కాలం మారింది. నేను మారలేదేమో!

పాత అలవాట్లకు పాత ఆచారాలకు పద్ధతులకు బందీ నయిపోయానేమో మరి! - అనుకుంది అన్నపూర్ణ.

పాప కళ్ళు మూసుకొని ప్రశాంతంగా పడుకొని వుంది.

"రాత్రి ఏమైనా తిప్పలు పెడ్తుందా?" అడిగింది అన్నపూర్ణ కూతురును.

"ఏం బాధపెట్టదమ్మ! ఆరోగ్యంగా వుంటే ఏం బాధపెట్టరు పిల్లలు!" అంది కళ్యాణి.

"అయ్యో! మా కాలంలో అయితే మాకు - అంటే - తల్లులకు పాలు ఇయ్యడం గుడ్డలు మార్చడం ఏడ్చే పిల్లల్ని సముదాయించడంతో నిద్రలే వుండేయి కావు!" అంటూ అన్నపూర్ణ పాప ముఖానికి దగ్గర తన ముఖం తీసికెళ్ళి గారాబం చేయబోయింది. బుగ్గ మీద ముద్దు పెట్టుకోబోయింది.

"అమ్మా! వద్దు!" తల్లినాపింది కళ్యాణి.

"పాప ముఖంలో ముఖం పెడ్తే ముద్దు పెట్టుకుంటె ఇన్‌ఫెక్షన్ వస్తుందని డాక్టరు చెప్పాడు. వద్దు ముద్దు పెట్టుకోకు" అంది కళ్యాణి.

"అదేం చోద్యమే! పిల్లల్ని ముద్దు చేయకుండా ఎట్లా వుంటాం!" అంది అన్నపూర్ణ. ఆమె ముఖం తెల్లబోయింది.

"అదే అమ్మా! నువ్వు చిన్నప్పుడు మమ్మల్ని పెంచినట్లుగా కాదు ఇప్పుడు ఈ పాపను జాగ్రత్తగా చూసుకోవాలి. ఆ పాత పనులేవీ చేయకు. డాక్టరు చెప్పినవన్నీ రేపు నీకు నేను ఆఫీసుకు వెళ్ళకముందు చెప్తాను" అంది కళ్యాణి.

"అప్పుడే ఆఫీసేమిటే! పురుడయినా పోసుకోలేదు!" నోరు వెళ్ళబెట్టింది అన్నపూర్ణ.

"నాకు రెండు వారాల కంటే ఎక్కువ సెలవు ఇయ్యనన్నారు. కాబట్టి రేపు ఉద్యోగానికి వెళ్ళాలి. అందులో నేను గ్రీన్‌కార్డుకు పెట్టుకున్నాను. ఎక్కువ లీవ్ పెడ్తే బాగుండదు. అన్నీ ప్రాబ్లమ్స్. అందుకే గదా! పాపను చూసుకోవాలని నిన్ను రమ్మనమన్నాం" అంది కళ్యాణి.

"అయ్యో! నీళ్ళాట కదా! కూతురుకు సాయం చేద్దామనుకున్నాను. కాని నేను వచ్చేసరికే దాని నీళ్ళాట అయిపోయింది! ఇప్పుడు పాపను చూసుకోవాలంటుంది. ఇక్కడేమో పద్ధతులన్నీ వేరేగా వున్నాయి. నేను ఎంతమందిని కనీ పెంచలేదు! మనుమలను మనుమరాళ్ళను ఎత్తుకోలేదు. ఇప్పుడు కళ్యాణి నాకు పాపనెలా పెంచాలో చెప్పడమేమిటి? ఏదో కాలం మారింది: పద్దతులు మారాయి నేర్చుకోవాలి మరి!" అని అనుకుంది అన్నపూర్ణ.

"కళ్యాణీ! డాక్టర్లు ఎన్నో చెప్తారు. కొన్నాళ్ళు తల్లిపాలు మంచిది కాదన్నారు. ఇప్పుడేమో తల్లిపాలే శ్రేష్ఠమైనవంటున్నారు! కొన్ని రోజులు బిడ్డకు నూనెతో మాలిష్ చెయ్యొద్దు పెరగరు ఎముకలు వంకర్లు పోతాయన్నారు. ఇప్పుడేమో నూనెతో మాలిష్ చేయడం మంచిదంటున్నారు. అట్లా వాళ్ళ అభిప్రాయాలు మారుతున్నాయి గాని మన పాత పద్ధతులే చివరకు మంచివని

తెలుతున్నాయే కళ్యాణి!" చిరునవ్వుతో పాపను చేతుల్లో ఊపుతూ అంది అన్నపూర్ణ.

"అమ్మా!" అని అరిచింది కళ్యాణి.

ఏమైందని - ఆగిపోయింది అన్నపూర్ణ.

"పాపనలా ఊపకు. ప్రమాదం!" అంది.

"ప్రతీది ఆంక్షలైతే ఎట్లానే? తల్లి!" అంది అన్నపూర్ణ నిస్సహాయంగా.

"సరే! పాపను పడుకోబెట్టు. కిందకి వంటింట్లోకి వెళ్దాం పద! వంట చెయ్యాలి!" అంది కళ్యాణి.

"వంట కాలేదా ఇంకా? తొమ్మిదయింది రాత్రి! వంటెప్పుడవుతుంది తినేదెప్పుడు? తనకేమో నీరసంగా అలసటగా వుంది మరి!" మనస్సులోనే అనుకొని కూతురు వెంట కిందికి వెళ్ళింది అన్నపూర్ణ.

వంటిల్లు కూడా అయోమయంగా వుంది అన్నపూర్ణకు. అదో చిన్నపాటి ల్యాబ్‌లా వుంది. ఆమె కొడుకుకాలేజీలో ఓసారి చూసింది. సైన్సు విషయం చదివేవాళ్ళ ల్యాబులు దాదాపు ఇట్లాగే వుంటాయి. వంటిల్లు ఎక్కడా ఏ మరక లేకుండా శుభ్రంగా తళతళ మెరుస్తున్నది. కళ్యాణి కొద్దిగా బియ్యం తీసి ఎలక్ట్రిక్ కుక్కర్‌లో వేసింది.

"ఆ కొద్ది బియ్యమేం సరిపోతాయే?" అంది అన్నపూర్ణ ఊరుకోలేక.

"చద్దన్నం మిగిల్తే ఇక్కడ మనమే తినాలమ్మా! అందుకనీ!" అంది కళ్యాణి.

"అమ్మా! ఇదిగో చింతపండు. నువు చారు బాగా చేస్తావు కదా చెయ్యి!" ఇన్ని ఉల్లి గడ్డలు నూనె - తల్లి ముందు పెట్టింది కళ్యాణి.

"సరే! చేయక తప్పదిప్పుడు" నిట్టూర్చింది అన్నపూర్ణ.

"పప్పు! కూర! చెయ్యాలా?" అడిగింది.

"పప్పు! కూరలు ఫ్రిజ్‌లో వున్నాయి. ఈ పూటకవి వేడి చేసుకుందాం. రేపు చేద్దువు గాని!" అంది కళ్యాణి.

అన్నపూర్ణ చారు చేసేలోగా ఎలక్ట్రిక్ కుకర్‌లో అన్నం అయింది. ఫ్రిజ్‌లో నుంచి పప్పుకూర తీసింది కళ్యాణి. అన్నపూర్ణ మైక్రోవేవ్ స్టౌలో పెట్టి వేడి చేసింది. మాటిమాటికి కళ్యాణి ఏం చేయాలో ఎట్లా చేయాలో ఏది తాకాలో ఏది తాకకూడదో చెప్తూనే వుంది!

చివరికి పొగలు కక్కే అన్నం చారు పప్పు కూరలతో కూతురు అల్లుళ్ళతో అన్నపూర్ణ డైనింగు టేబిల్ ముందు కూర్చుంది. అన్నం చారు పప్పు కూరలేవీ ఆమెకు రుచించలేదు. వేటి రుచి బాగా లేదు! అదేమిటో! చారు తనే చేసింది మరి! నీళ్ళ తీరు! కొత్త జాగా! రుచులు అలవాటు అయిందాకా అర్ధాకలితో వుండవలసిందే మరి! - అనుకుంది అన్నపూర్ణ భోజనం చేస్తున్నప్పుడు

"కళ్యాణీ! నీకు కొన్ని ప్రత్యేకమైన పొడులు, మందులు తెచ్చాను. అవి తిను. నడుంకు బలం వుంటుంది. పాలు బాగా వస్తాయి" చెప్పింది అన్నపూర్ణ.

"అమ్మా! ఆ పాతకాలం మందులు మాకులు గురించి మాట్లాడకు. నేను జాబ్‌లో జాయిన్ కావాలి మరి! పాపను ఎట్లా చూసుకుంటావో ఏమిటో" అంది కళ్యాణి విచారంగా భయంగా.

"డోన్ట్‌వరీ కళ్యాణీ ! నేను మధ్యాహ్నం ఆఫీసు నుంచి వచ్చి ఓసారి చూసి వెళ్తాను" అన్నాడు ఆనంద్.

"రేపే ఉద్యోగమేమిటి ఆనంద్! నువ్వయినా చెప్పరాదు కనీసం ఇరవై ఒక్కదినం అయ్యాక పాపకు పేరు పెట్టిం తర్వాత ఆఫీసుకు వెళ్ళమని!" అల్లుడ్ని ప్రార్థిస్తున్నట్లుగా అంది అన్నపూర్ణ.

"అయ్యో ఇక్కడ ఉద్యోగాల సంగతులు మీకు తెలియవు అత్తయ్యా! కళ్యాణి రేపు జాబులో జాయిన్ కావాలి. లేకపోతే ఉద్యోగమే ఊడిపోతుంది!" అన్నాడు ఆనంద్.

"ఊడిపోతే ఊడిపోని! అటువంటి ఉద్యోగం మానేసి మరో మంచి ఉద్యోగం చూసు కోవచ్చు! మరీ! సెలవులే ఇయ్యని ఉద్యోగం ఏం ఉద్యోగం. అయినా కొన్నాళ్ళు ఉద్యోగం మానేసి పాపను చూసుకుంటూ ఇంట్లో వుంటుందేమి తప్పిపోతుందట ఉద్యోగం లేకపోతే! నీకు ఉద్యోగముందిగా. చాలు! హాయిగా పాప పెంపకంలో కళ్యాణికి నేను సాయంగా కొన్నాళ్లుండి వెళ్ళిపోతాను!" అంది అన్నపూర్ణ హుషారుగా.

కళ్యాణి ఆనంద్‌లు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

"అత్తయ్య! కళ్యాణికి ఉద్యోగం లేకపోతే ఈ ఇల్లు గడిచేదెట్ల? నా ఒక్కని జీతంతో ఇదంతా - ఇంటి లోను కార్ల లోను వగైరా కష్టమౌతుంది!" అన్నాడు మెలమెల్లగా ఆనంద్.

"లోను! అంటే అప్పులా! అంటే అప్పులు చేసి ఈ కార్లు ఇల్లు కొన్నారా? ఏమో బాబు అప్పు అంటే నా కాళ్ళు చేతులు గజగజ వణికిపోతాయి. వెనుకటికి మా పెద తాత ఒకాయన అప్పులు చేసి సంసారాన్నంతా నాశనం చేసాడు. అప్పు! - అంటే మరి నాకు చాలా భయం తల్లీ!" అన్నపూర్ణ కూతురు వైపు భయం భయంగా చూసింది.

అన్నపూర్ణను చూసి కళ్యాణి ఆనంద్‌లు ఇద్దరూ ఒకేసారి పెద్దగా నవ్వారు.

"అమ్మా! లోనులంటే అటువంటి అప్పులు కావు!"

"మరి నీ జీతం లేందే లోనులు కట్టలేమంటున్నారు గదా మరి!"

కళ్యాణి మళ్ళీ నవ్వింది.

"నేనింత చదివి ఇంట్లో కూర్చుంటె ఏం బావుంటుంది చెప్పు. అమ్మా! నువ్వు వున్నావు గదా. పాపను చూసుకోడానికి" అంది కళ్యాణి.

"అయితే కనీసం పాపకు పేరు పెట్టిందాకనయినా ఇంట్లో వుండు మరి?" అంది అన్నపూర్ణ కూతురును వేడుకుంటున్నట్లుగా.

"పాపకు పేరు అప్పుడే పెట్టాం" అన్నాడు ఆనంద్.

"పేరు అప్పుడే పెట్టారా? అదెట్లా? చుట్టాలు పక్కాలు స్నేహితులను పిల్చి కదా పేరు పెడ్తాం. అదేమే కళ్యాణీ! నేను వచ్చేసరికే నీ నీళ్ళాటయింది? పాపకు పేరు పెట్టారు. ఇక నేను వచ్చింది ఎందుకే? నే రాకున్నా నడిచేది కదా!" అంది అన్నపూర్ణ బాధపడే స్వరంతో.

"అదేం కాదమ్మా! ఇక్కడ పుట్టగానే హాస్పిటల్లో పాప పేరు రాయించాలె! అందుకే పేరు పెట్టాం" అంది కళ్యాణి అదేం పెద్ద విషయం కాదన్నట్లుగా.

"మరి నువ్వు రాకపోతే ఈ పాపనెవరు చూసుకుంటారమ్మా. మేము ఆఫీసుకెళ్తే పాపను చూసుకుంటావనే గద పిల్చాము నిన్ను" అంది కళ్యాణి చిరుకోపం ధ్వనించేటట్లుగా.

అన్నపూర్ణ కూతురు మాటలకు బాధపడినట్లుగా పైకి కనపడనియ్యలేదు. చిరునవ్వు నవ్వింది.

"ఏం పేరు పెట్టారే?" అని అడిగింది. ఆమె మనమరాలి పుడ్తుందో మనుమడు పుడ్తాడో అని ఆడపేర్లు ఓ డజను మగపేర్లు ఓ డజను సెలక్టు చేసుకొని వ్రాసుకొని తెచ్చింది. బంగారు గొలుసు బంగారు మురుగులు చేయించుకొని తెచ్చింది బారసాలనాడు అందరి ముందు పెడ్దామని. ఇక బారసాలే లేదు. పేరు అప్పుడే పెట్టారనేసరికి ఆమెకు తను వచ్చిన ధ్యేయమే ఏమీ లేనట్లుగా అనిపించింది.

"లైలా అని పేరు" అని కళ్యాణి పూర్తి చేయకముందే అన్నపూర్ణ షాక్ తిన్నట్లుగా.

"అదేం పేరే! లక్షణమైన పేర్లు ఎన్నో వుండగా" అంది.

"అమ్మా! ప్రతిది నువ్వనుకున్నట్లుగా జరుగుతుందనుకోవడం టూ మచ్! ఆ పేరయితే ఇక్కడి వాళ్ళకు పిలవడానికి సులభంగా వుంటుందని పెట్టాం" అంది కళ్యాణి కోపంగా.

"అదేమిటే సులభంగా పలికే లక్షణమైన పేర్లు లేవా?" అంది అన్నపూర్ణ. ఇక అన్నపూర్ణ ఎక్కువ మాట్లాడి లాభం లేదనుకుంది. ఆమెకు అలసటగా వుంది. ఇక్కడి తీరంతా ఆమెకు విచిత్రంగా వుంది. ఆమె ఏదో వింత పరిస్థితుల్లో బందీ అయినట్లు ఊపిరాడనట్లు అనుభవం పొందింది.

"సరే! ఇంతసేపు మరిచేపోయాను. నాన్నగారు ఎట్లా వున్నారు చెప్పు!" అంది కళ్యాణి.

"బాగానే వున్నారు! ఆయనకేమో వీసా ఇయ్యలేదు మరి! ఆయన కూడా వస్తే బాగుండేది!" అంది అన్నపూర్ణ.

"వస్తే బాగానే వుండేది. నీకు తోడుగా వుండేవారు. పొద్దున్నే మేము ఏడుగంటలకే వెళ్ళిపోతాం ఉద్యోగానికి- మళ్ళా మేం వచ్చేసరికి సాయంత్రం ఆరు- ఏడూ అవుతుంది!"

అంది కళ్యాణి.

"అమ్మో! అంతసేపు రోజు నేను ఒక్కతెను!" అంది అన్నపూర్ణ వెంటనే.

"ఏంటమ్మా నాన్నగారిని విడిచిపెట్టి వుండలేవా? ఇంత వయస్సు వచ్చాక కూడా ఏమిటమ్మా ఈ మాటలు! మరి పాపను చూసుకోడానికి నువ్వు ఓ రెండు మూడేండ్లు ఇక్కడే వుండిపోతావని మేమనుకుంటున్నాం" అంది కళ్యాణి.

"అది కాదే" అంది అన్నపూర్ణ కళ్ళల్లో నీళ్ళతో. కన్నీళ్ళు బయటికి రాకుండా ఆమె కనురెప్ప అల్లల్లాడించి దిగమింగుకుంది.

తెల్లవారి పొద్దున్నే కూతురు అల్లుడూ ఆఫీసులకెళ్ళిపోయారు ఎవరి కార్లో వాళ్ళు. వెళ్తూ వెళ్తూ మరోసారి ఏమేమి చేయాలో వివరంగా చెప్పింది కళ్యాణి.

"పచ్చి బాలెంతరాలవు! డ్రైవింగు ఎట్లా చేస్తావే?" అంటే కూడా అన్నపూర్ణ మాటలు విననట్లుగానే వెళ్ళిపోయింది కళ్యాణి.

కళ్యాణి ఆనంద్ వెళ్ళిపోయింతర్వాత అన్నపూర్ణ పాపకు స్నానం చేయించింది. పాలు తాగించింది వేళకు. అప్పుడప్పుడు డయపర్ మార్చింది. పాప ఏమీ ఏడ్వడంలేదు. సతాయించడం లేదు. కాని ఇన్నేళ్ళ తర్వాత చిన్నపాపను చూచుకోవడం అలవాటు తప్పిపోయి కష్టంగానే వుంది. అయినా బాధగా లేదు. కాని పలకరించడానికి ఎవరూ లేక ఇంత ఇంట్లో ఒక్కతె వుండడం బాధగా వుంది అన్నపూర్ణకు.

ఒక్కదానికే అన్నపూర్ణకు పొద్దున్న నాస్తా గాని మధ్యాహ్నం భోజనం గాని చేయబుద్ధి కాలేదు. కిటికీలోంచి బయటికి చూస్తే ఇళ్ళు దూరంగా కన్పించాయి. ఆ ఇళ్ళ తలుపులు, కిటికీలు మూసి వున్నాయి. రోడ్ల మీద అప్పుడప్పుడు కార్లు వేగంగా పోతూ కన్పించాయి గాని మనుషులెవరూ కన్పించలేదు. "అదేమిటి ఆ ఇళ్ళల్లో ఎవరూ వుండరా?" ఆశ్చర్యపోయింది అన్నపూర్ణ.

పొద్దుపోకపోతే టీవి పెట్టుకొమ్మని కళ్యాణి వాళ్ళ టీవీని ఆన్ ఆఫ్ చేసే పద్ధతి చూపించింది. కాని ఒక్క ప్రోగ్రాం ఆమెకు చూడాలనిపించలేదు. కిటికీలోంచి దూరంగా కన్పించే ఇళ్ళను పచ్చని చెట్లను వ్యాపించిన పచ్చిక బయళ్ళను చూస్తుండిపోయింది అన్నపూర్ణ. "కానీ రోజూ ఇట్లా జెయిల్లో జీవితంలాగా ఎట్లా గడపాలి - బెంగపడిందామె. కూతురు అల్లుడు ఎప్పుడు వస్తారా? - అని ఎదిరి చూడడం పనయింది ఆమెకు.

ఏడుగంటలకు కూతురు అల్లుడు కాస్త వెనుక ముందుగా ఒకరి తర్వాత ఒకరు వచ్చారు. "అబ్బ! ట్రాఫిక్కు. ఆలస్యమయిందమ్మా! రోజూ ఇంతే! ఈ ట్రాఫిక్కు" అంది కళ్యాణి.

ఆమె చాలా అలిసిపోయినట్లుగా కన్పించింది. "స్నానం చేసి నేను కాస్సేపు పడుకుంటా

నమ్మా! ఇంతలో నువ్వు వంట చెయ్యి. ఏమైనా స్పెషల్ చెయ్యమ్మా!'' అంది కళ్యాణి.

ఆనంద్ కూడా అలిసిపోయి కన్పించాడు. అయినా తన గదిలోకి వెళ్ళిపోయాడు. అన్నపూర్ణ వంటింట్లో దూరింది. వెజిటబుల్ బిర్యానీ, పెరుగుచట్నీ చేసింది.

తొమ్మిది గంటలకు కళ్యాణి ఆనంద్‌లు కిందికి డైనింగు హాలుకు వచ్చారు. అంతసేపు అన్నపూర్ణ ఒంటరిగా కింద తన గదిలో వుంది.

కూతురూ అల్లుడు తను చేసిన బిర్యానీ చాలా బాగుందని ఆవురావురుమని తిన్నారు. అన్నపూర్ణకు ఆకలిగా అనిపించలేదు.

ఆమె తినడం లేదని ఇద్దరూ గమనించలేదు. తినగానే - ఇద్దరూ నిద్ర వస్తుందని తమ పడగ్గదిలోకి వెళ్ళిపోయారు.

''అమ్మా! అలిసిపోయాను. రేపు తొందరగా వెళ్ళిపోవాలి గద! నువ్వు కూడ అలిసిపోయి వుంటావు పడుకో!'' అంది కళ్యాణి.

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయింతర్వాత వంటిల్లంతా సర్దింది అన్నపూర్ణ. సర్దడం అయిం తర్వాత తన గదిలోకి వెళ్ళి పడుకుంది అన్నపూర్ణ. ఆమెకు నిద్ర రాలేదు.

''నీళ్ళాటలో సాయంగా వుండి బిడ్డకు పేరు పెట్టగానే నెల - రెండు నెలల్లో వెళ్ళి పోదామని వచ్చాను.కాని కళ్యాణేమో పాప స్కూలుకెళ్ళిందాకా ఇక్కడే వుండిపొమ్మంటున్నది. అంటే - రెండు మూడేళ్ళు ! ఈ ఒంటరితనంతో ఇంట్లో బందీ అయి ఎట్లా గడుపుతానో?'' అన్నపూర్ణకు అంతు పట్టలేదు.

* * *